సాక్షి ములుగు

శనివారం | 11 | జనవరి | 2025

గరిష్ఠం/కనిష్ఠం
28.0°/16.0°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

ఏటూరునాగారం: సీతారామచంద్రస్వామి ఆలయంలో హారతి ఇస్తున్న అర్చకుడు



వైభవంగా 'ముక్కోటి ఏకాదశి'

ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం తెల్లవారు జామున ఏటూరునాగారం మండలం సీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారామచంద్ర స్వామి వారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు. ప్రధాన అర్చకుడు యల్లాప్రగడ నాగేశ్వర్‌రావు శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉత్తర ద్వారాన్ని తెరిచారు. ముక్కో టి ఏకాదశి రోజు ఉపవాసం ఉంటే కలిగే లాభా లను, భక్తి శ్రద్ధలతో దేవతలను పూజిస్తే వచ్చే ఫలాలను భక్తులకు వివరించారు. అలాగే సూ ర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో రామకోటి చేపట్టగా భక్తులు అధిక సంఖ్యలో రామకోటి రాసి అర్చకులకు అందజేశారు. - ఏటూరునాగారం



సీతారామచంద్రస్వామి ఆలయంలో రామకోటి రాస్తున్న భక్తులు



వెంకటాపురం (కె): వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

- మరిన్ని ఫొటోలు 11లో ▸

న్యూస్‌రీల్

రెవె'న్యూ' కార్యాలయం రెడీ



ములుగు: నూతన మండలంగా ఏర్పడిన మల్లంపల్లిలో ప్రభుత్వ శాఖల ఏర్పాటుకు కసరత్తు వేగవంతమైంది. మండలకేంద్రంలోని పీఏసీఎస్ భవనాన్ని తహసీల్దార్ కార్యాలయానికి కేటాయించారు. ఈ మేరకు భవనానికి సంబంధించిన పనులు జరుగుతున్నాయి. ఈ నెల 16న మంత్రి సీతక్క చేతుల మీదుగా కార్యాలయం ప్రారంభంకానుంది. రెవెన్యూ కార్యాలయం ప్రారంభమైన తర్వాత మిగతా కార్యాలయాల ప్రారంభానికి అడుగుపడనుంది. ఎంపీడీఓ కార్యాలయానికి పాత గ్రామ పంచాయతీ భవనాన్ని కేటాయించినట్లుగా తెలుస్తుంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ములుగు: జిల్లా పరిధిలో నేడు (శనివారం) ఉదయం 9 గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టీజీఎన్‌పీడీసీఎల్ ములుగు డివిజనల్ ఇంజనీర్ నాగేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు, మల్లంపల్లి, రాంచంద్రాపూర్, వెంకటాపూర్, వెల్తుర్లపల్లి, పస్రా, గోవిందరావుపేట, తాడ్వాయి, మేడారం, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, కమలాపూర్, మంగపేట, మల్లూరు, వాజేడు, నూగూరు వెంకటాపురం, అలుబాక ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలి



ములుగు రూరల్: జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని జంగాలపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పోషకాహారం తీసుకోవడంతో పాటు శారీరక శ్రమ చేసినప్పుడే బీపీ, షుగర్ లాంటి వ్యాధులు అదుపుతో ఉంటాయన్నారు. ఆరోగ్య సిబ్బంది శానిటేషన్ కమిటీ మీటింగ్, అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహించే వీహెచ్‌ఎన్‌డీ సందర్భంగా వచ్చే గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఓపీ రిజిస్టర్, మందుల నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డెమో ఇన్‌చార్జ్ సంపత్, ఆరోగ్య కార్యకర్తలు రమ తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయాలి

వెంకటాపురం(ఎం): ఈనెల 14న మండల కేంద్రానికి రానున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి కాడ పాక శ్యాం పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ నాయకులు దొమ్మటి రమేష్, మోరె లింగస్వామి, గద్దమీది రమేష్, వంశీ, అల్లకొండ కుమార్, కిరణ్, అనిల్, కుమార్ పాల్గొన్నారు.

'ఆశ'లకు కనీస వేతనం అమలు చేయాలి



ములుగు రూరల్: బడ్జెట్ సమావేశాల్లో ఆశకార్యకర్తలకు కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయాలని ఆశల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండబోయిన రవిగౌడ్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రత్నం నీలాదేవి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. మంత్రికి వినతిపత్రం అందించేందుకు ర్యాలీగా బయలుదేరిన ఆశలను పోలీసులు అడ్డుకొని మంత్రి పీఏ విజయ్‌కి వినతిపత్రం ఇప్పించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ ఏఎంసీ టార్గెట్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సర్వే బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రిలే నిరాహార దీక్షలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశలు కనకలక్ష్మీ, సుభద్ర, రాధా, సుగుణ, పూర్ణ, కవిత, సుజాత, సహిదా పాల్గొన్నారు.

98 శాతం పూర్తయిన సర్వే..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేసింది. ప్రజాపాలనలో 90,863 మంది ఇళ్లు కావాలని దరఖాస్తు చేశారు. లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో సర్వే నిర్వహిస్తుంది. ఇప్పటి వరకు 88,552 మంది దరఖాస్తుల సర్వే పూర్తయింది. ఇందులో సొంత స్థలం ఎంతమందికి ఉంది, ఇందిరమ్మ గృహానికి అర్హులేనా కాదా అనే రీతిలో పంచాయతీ కార్యదర్శులు సర్వే నిర్వహిస్తూ మొబైల్ యాప్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తున్నారు. జిల్లాలో 98 శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. ఈనెల ఆఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది.



మండలానికో మోడల్ హౌస్

ఇంటినిర్మాణ కొలతలు ఇలా..

మొత్తం 400 చదరపు అడుగుల విస్తీర్ణం	
హాలు:	9.0X10.10
వంటగది:	6.9X10.0
బెడ్ రూమ్ విత్ అటాచ్డ్ బాత్‌రూమ్:	12.5X10.5

ఎంపీడీఓ కార్యాలయాల్లో ఇందిరమ్మ నమూనా ఇల్లు

- జిల్లాలో 9 ఇళ్ల ఏర్పాటుకు శ్రీకారం
- ఇప్పటికే పలు మండలాల్లో పనులు మొదలు
- 20 రోజుల్లోగా పూర్తి చేసేందుకు అధికారుల కసరత్తు

వెంకటాపురం(ఎం): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రతీ మండలకేంద్రంలో ఒక మోడల్ హౌస్ (నమూనా ఇల్లు) నిర్మించాలని నిర్ణయించింది. మండల పరిషత్ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో ఇంటిని నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించగా జిల్లాలోని 9 మోడల్ హౌస్‌ల నిర్మాణాలకు రూ.45 లక్షలను ప్రభుత్వం కేటాయించింది.

లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు..

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.5లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తవుతుందా అనే సందేహం ప్రజల్లో నెలకొంది. దీనిని నివృత్తి చేయడానికి ప్రభుత్వం రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. నమూనా ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసిన రోజు నుంచి కేవలం 20 రోజుల్లో అన్ని హంగులతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని గృహ నిర్మాణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇంటి నిర్మాణ కొలతలను అధికారులు నిర్ధారించారు. 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం చేపట్టనున్నారు. 9.0 x 10.0 సైజులో హాలు, 6.9 x 10.0 సైజులో వంట గది, 12.5 x 10.5 సైజులో బెడ్ రూమ్ విత్ ఎటాచ్డ్ బాత్‌రూమ్‌ను నిర్మించనున్నారు. రెండు తలుపులు, రెండు కిటికీలు, ఒక వెంటిలేటర్ ఉండేలా ఏర్పాటు చేశారు.

16న మంత్రి చేతుల మీదుగా ప్రారంభం

ఈనెల 16న పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క చేతుల మీదుగా ములుగు ఎంపీడీఓ కార్యాలయంలో ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన జరగనుంది. ఇప్పటికే గోవిందరావుపేట, వెంకటాపురం(ఎం) మండలాల్లో మోడల్ హౌస్ నిర్మాణానికి ముగ్గు పోయగా శుక్రవారం తాడ్వాయి మండలంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు ముగ్గు పోసి పనులు ప్రారంభించారు.



తాడ్వాయిలో నమూనా ఇంటి నిర్మాణానికి ముగ్గు పోస్తున్న అధికారులు



గోవిందరావుపేటలో కొనసాగుతున్న పనులు

20 రోజుల్లోగా పూర్తి చేస్తాం..



జిల్లాలోని 9 మండలాల్లో ఇందిరమ్మ నమూనా ఇళ్లను నిర్మించనున్నాం. వెంకటాపురం, గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లో ఇంటి నిర్మాణాలకు ముగ్గు పోసి పనులు చేపడుతున్నాం. మిగిలిన మండలాల్లో కూడా నమూనా ఇళ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మండల కేంద్రాల్లోని అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో మోడల్ హౌస్‌లను నిర్మిస్తున్నాం. 20 రోజుల్లోగా మోడల్ హౌస్‌లను పూర్తి చేసి ప్రజలకు ఇంటి నిర్మాణాలపై అవగాహన కల్పిస్తాం.

- ఎస్.సూర్యనారాయణ, పీడీ (హౌసింగ్)

ప్రయాణికుల రద్దీ

ఏటూరునాగారం: సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో పట్టణాల్లోని విద్యార్థులు సొంత గ్రామాలకు వెళ్లడం, మండలంలో ఉన్న విద్యార్థులు వేరే ప్రాంతాలకు తరలివెళ్తుండడంతో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడాయి. శుక్రవారం ఏటూరునాగారం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ నెలకొంది. కొంత మంది హాస్టల్ విద్యార్థులు వారి సొంత గ్రామాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో తరలివెళ్లారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్, ప్రధాన రోడ్లు కిక్కిరిసిపోయాయి. పండుగ వేళ ఆర్టీసీ సేవలను మరింత పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

గెలుపు ఓటములు సహజం

ములుగు రూరల్: క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని కొత్తూరు దేవుని గుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో స్నేహపూర్వక వాతావరణంలో క్రీడలను కొనసాగించాలన్నారు. సంక్రాంతి సందర్భంగా జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించిన ఆలయ కమిటీ చైర్మన్ వీరమనేని కిషన్‌రావు, నితిన్‌రావులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, నల్లెల్ల భరత్‌కుమార్, కుమార్‌గౌడ్, తిరుపతిరెడ్డి, సుమన్, రవిందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న రవిచందర్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఓరుగల్లు అభ్యర్థి

- పులి సరోత్తంరెడ్డిని ప్రకటించిన బీజేపీ
- 2019లో ఉపాధ్యాయ వృత్తికి స్వచ్ఛంద పదవీ విరమణ
- పీఆర్‌టీయూలో కీలక భూమిక.. ఆ తర్వాత బీజేపీలో చేరిక

హన్మకొండ: నల్లగొండ–వరంగల్–ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా పులి సరోత్తంరెడ్డిని ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధికారికంగా ప్రకటించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం మందలూరిపల్లె గ్రామానికి చెందిన సరోత్తంరెడ్డి ప్రస్తుతం ఎస్‌బీహెచ్ కాలనీలో నివాసం ఉంటున్నారు. 1984లో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన సరోత్తంరెడ్డి, 2019 ఫిబ్రవరిలో స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారు. అదే సంవత్సరం మార్చిలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి 11శాతం ఓట్లు పొందారు. పీఆర్‌టీయూలో కీలక భూమిక పోషించిన సరోత్తంరెడ్డి 2004 నుంచి 2012 వరకు పూర్వ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2012 నుంచి 2019 వరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. తర్వాత బీజేపీలో చేరారు. ప్రస్తుతం బీజేపీ రిటైర్డ్ టీచర్స్, ఎంప్లాయీస్ సెల్ రాష్ట్ర కో చైర్మన్‌గా కొనసాగుతున్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నారు. తెలంగాణ టీచర్స్ జేఏసీ రాష్ట్ర చైర్మన్‌గా పనిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులతో సత్సంబంధాలు ఉన్న ఆయనను నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా ప్రకటించింది. తనకు అవకాశం కల్పించిన పార్టీ అధిష్టానానికి సరోత్తంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



పులి సరోత్తంరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి

'అపార్' ఐడీ నమోదు చేయాలి

సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి రాజు

ఏటూరునాగారం: ప్రతీ విద్యార్థికి అపార్ ఐడీని నమోదు చేయాలని సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి అర్షం రాజు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని తాళ్లగడ్డ ఆకులవారిఘణపురం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ పోచం ఆధ్వర్యంలో ఒక్కరోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానం 2020 సిఫారసుల మేరకు వన్ నేషన్ – వన్ స్టూడెంట్ ఐడీ అనే ఉద్దేశంతో ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) అనే 12 అంకెల గుర్తింపు సంఖ్యను ఇచ్చే ప్రక్రియను కేంద్రం 2023లో ప్రారంభించిందన్నారు. శిశు తరగతి నుంచి ఉన్నత విద్య పూర్తయ్యే వరకు అదే నంబర్ ఉంటుందన్నారు. ఈ గుర్తింపు సంఖ్యను ట్రాక్ చేయడం ద్వారా విద్యార్థుల డ్రాప్ ఔట్ రేట్ తగ్గించడం, ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వెళ్లినా అతని అభ్యసన సామర్థ్యాలను ఈ ఐడీతో గుర్తించవచ్చు అన్నారు. విద్యార్థుల పూర్తి వివరాలు ఆధార్ ప్రకారం పాఠశాలలు, కళాశాలల్లో ఒకే విధంగా ఉంటేనే అపార్ ఐడీని జనరేట్ చేయడం జరుగుతుందన్నారు. ఆయా పాఠశాలల యజమాన్యం అపార్ ఐడీని విద్యార్థులకు నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ క్షేత్రయ్య, ఏసీఎంఓ రవీందర్, జీసీడీఓ సుగుణ, డీఈఓ కార్యాలయ సిబ్బంది హెచ్‌ఎంలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సెక్టోరల్ అధికారి రాజు

మేడారంలో పారిశుద్ధ్య పనులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారంలోని పారిశుద్ధ్య పనులను డీపీఓ దేవరాజు శుక్రవారం పరిశీలించారు. జంపన్నవాగు స్నానఘట్టాల వద్ద ఉన్న డ్రెసింగ్ గదులను కార్మికులతో శుభ్రం చేయించారు. మినీ జాతర సందర్భంగా భక్తుల విడిది షెడ్లలో జరుగుతున్న మరమ్మతు పనులను ఆయన పరిశీలించి గుత్తేదారుడికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ జాతరకు ముందస్తుగా మేడారానికి వచ్చే భక్తులకు పారిశుద్ధ్యంతో ఇబ్బంది కలుగకుండా పరిశుభ్రత చర్యలు చేపడుతున్నామన్నారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు ఎక్కడపడితే అక్కడ చెత్తచేదారం పడేయవద్దన్నారు. ముందుగా ఆయన అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సతీష్, తదితరులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న డీపీఓ దేవరాజు

12 నుంచి ఐలోని మల్లన్న జాతర


గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మలతో మల్లికార్జునుడు

ఐనవోలు: వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఐనవోలు(ఐలోని) శ్రీమల్లికార్జున స్వామి జాతర ఈనెల 12వ తేదీన ప్రారంభం కానుంది. లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చే ఈ జాతరలో ఇబ్బందులు కలుగకుండా దేవాదాయ శాఖ అధికారులతోపాటు వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జానపదుల జాతరగా కీర్తినొందుతున్న ఐనవోలు మల్లికార్జునస్వామి ఉత్సవాలు ఆదివారం విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. అయితే ప్రతి బుధ, ఆది వారాలలో భక్తులు ఎక్కువగా హాజరయ్యే ఈ ఉత్సవాలు సుమారు మూడు నెలలపాటు కొనసాగనున్నాయి.

ఏర్పాట్ల పరిశీలన



ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయంలో సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే జాతర ఏర్పాట్లను దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్(ఆర్‌జేసీ) రామకృష్ణారావు పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం ఆలయానికి చేరుకున్న ఆయన మల్లన్నను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ సిబ్బందితో కలిసి ఆలయ ప్రాంగణం అంతా కలియదిరిగారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఈఓను ఆదేశించారు.

జాతర షెడ్యూల్

- జనవరి 12న ఉత్సవాలు ప్రారంభం స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలంకరణ
- 13న భోగి పండుగ, స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం
- 14న మకర సంక్రాంతి పండుగ, ప్రత్యేక పూజలు, 'రాత్రి ప్రభల' బండ్లు తిరుగుట
- 16న మహాసంప్రోక్షణ సమారాధన
- ఫిబ్రవరి 3 వసంత పంచమి, శ్రీభ్రమరాంబిక అమ్మవారి ఏకాదశ వార్షికోత్సవం
- ఫిబ్రవరి 12న ఎల్లమ్మ దేవత పండుగ
- ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు పాంచాహ్నిక దీక్షతో త్రికుండాత్మకంగా భ్రమరాంభిక మల్లికార్జున స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు
- 24న శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం. ఉదయం సూర్యప్రభ వాహనసేవ, రాత్రి చంద్రప్రభ వాహనసేవ
- 25న ఉదయం అశ్వ వాహనసేవ, రాత్రి శేషవాహనసేవ, బలిహరణ
- 26న మహాశివరాత్రి 'శివకల్యాణం' పెద్దపట్నం, ఉదయం సింహ వాహనసేవ, రాత్రి నంది వాహనసేవ
- 27న రావణ వాహనసేవ, రాత్రి రథోత్సవం, పురవీధి సేవ
- 28న పర్వత వాహనసేవ, రుద్రహోమం, చండీ హోమం, బ్రహ్మోత్సవాల ముగింపు, రాత్రి పవళింపుసేవ, పుష్పోత్సవం, ఏకాంత సేవ
- మార్చి 23న గొల్లకేతమ్మ, బలిజ మేడలమ్మలతో మల్లికార్జునస్వామి కల్యాణం, పెద్దపట్నం, ఊరేగింపు
- 30న 'ఉగాది' బిల్వార్చన, సాయంత్రం పంచాంగ శ్రవణం


గిరిజనులు ఉపయోగించిన పురాతన పనిముట్లు


గిరిజన వాయిద్యాలు


పూర్వకాలం నాటి సామగ్రి

విజ్ఞాన పీఠం@30

నేటితో మూడు దశాబ్దాలు పూర్తి | **పరిశోధనాలయంగా గుర్తింపు**

- అరుదైన జానపద కళారూపాల సేకరణ
- ఈఏడాది నుంచి ఎం.ఏ హిస్టరీ అండ్ టూరిజం కోర్సు

హన్మకొండ కల్చరల్ : ఓరుగల్లు నగరం చారిత్రక ఆనవాళ్లకు నిలయం. కాకతీయుల కాలం నుంచి నేటికి అనేక కట్టడాలతోపాటు విద్యాభివృద్ధిలో ప్రత్యేక స్థానం ఓరుగల్లుది. ఇంతటి ప్రత్యేకత కలిగిన వరంగల్ నగరం నడిబొడ్డున భద్రకాళీ దేవస్థానం.. విశాలమైన చెరువు.. ఆ పక్కనే భద్రకాళీ ట్యాంక్‌బండ్ ఒడ్డున ఆహ్లాదకరమైన వాతావరణంలో కొలువై ఉంది.. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠం. ఓరుగల్లు సిగలో అద్భుత పరిశోధనాలయంగా వెలుగొందుతోన్న ఈ జానపద గిరిజన విజ్ఞాన పీఠం ఏర్పాటై 30ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రత్యేక కథనం..

జానపద, గిరిజన పీఠం

1995లో తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య పేర్వారం జగన్నాథం, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు, కాళోజీ రామేశ్వరరావు, అంపశయ్య నవీన్ వంటి జిల్లా ప్రముఖుల ఆకాంక్షతో ఈ పీఠం ఏర్పాటైంది. 1999లో అప్పటి కలెక్టర్ శాలినీమిశ్రా హంటర్‌రోడ్‌లో 3.7ఎకరాల స్థలం కేటాయించగా.. నాడు ఎంపీగా ఉన్న ఆచార్య సి.నారాయణరెడ్డి అందించిన రూ.30లక్షల ఎంపీ లాడ్స్ నిధులతో 2000 సంవత్సరంలో సొంతభవన నిర్మాణం జరిగింది. ఆతర్వాత నాయకులు పట్టించుకోకపోవడంతో ఈ పీఠానికి నేటికీ కనీసం ప్రహరీ లేకపోవడం గమనార్హం. తెలంగాణ సంస్కృతికి పెద్దపీట వేస్తున్న ఈ పీఠాన్ని రక్షించుకునే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విద్యావేత్తలు ఆకాంక్షిస్తున్నారు.

పరిశోధనలు..

ఈ విజ్ఞాన పీఠం ఆధ్వర్యంలో నేటికీ అనేక పరిశోధనలు కొనసాగుతోన్నాయి. పీఠానికి చెందిన పరిశోధనా బృందాలు గ్రామాలకు వెళ్లి అక్కడి జీవన విధానం. వారు కాపాడుతున్న విజ్ఞానాన్ని సేకరించి భవిష్యత్ తరాలకు అందించేందుకు కృషి చేస్తున్నారు. అయితే జానపద, గిరిజన జాతుల సంస్కృతి, జీవనవిధానంపై పరిశోధనలు కొనసాగిస్తూనే 1998లో పీహెచ్‌డీ, ఎం.ఫిల్ కోర్సులు ప్రారంభమయ్యాయి. 2024–25 సంవత్సరానికి ఎం.ఏ తెలుగు రెగ్యూలర్ కోర్సు ప్రవేశపెట్టారు.


పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం భవనం

జానపద, గిరిజన విజ్ఞానంపై పుస్తకాలు

పూర్వ పీఠాధిపతుల ఆధ్వర్యంలో ఇప్పటివరకు జానపద విజ్ఞాన సమాలోచన, నల్గొండ-రాష్ట్రస్థాయి జానపద కళోత్సవాలు ప్రత్యేక సంచిక, జానపద కిరణం త్రైమాసిక పత్రిక, మన పల్లెటూళ్ల పాటలు-అమ్మాపురం, కొర్రాజుల కథలు, జానపద విజ్ఞానదర్శిని చౌళ్లపల్లి, జానపదవిజ్ఞాన దర్శిని విస్సూరు, వల్మిడి, ద్రౌపది తిరుణాళ్ల (ధర్మరాజు తిరునాళ్ల, తూర్పుగోదావరి జిల్లా జానపద ఆటలు, మేడారం సమ్మక్క సారలమ్మ జాతర, కొండరెడ్డి గిరిజనుల జీవనవిధానం, బొడ్లంక పాటలు, పగటివేష కళాకారులు సాంస్కృతిక జీవనం (పార్వతీనగర్), మల్లన్నజాతర -ఐనవోలు, బంజారాల తీజ్‌పండుగ, సమ్మక్క సారలమ్మ జాతర, ఖోంథ్, కమ్మరి, భగత, వాల్మీకి, కొండదొర, మాలి, నూకదొర తదితర విశాఖపట్నం గిరిజనుల తెగలపై పుస్తకాలు, కోయ, కొండరెడ్డి ఖమ్మం గిరిజన తెగల జీవనస్థితిగతులపై పుస్తకాలు ప్రచురించారు. జానపద గిరిజన పీఠం ఆధ్వర్యంలో ఇప్పటివరకు 18 జాతీయ సదస్సులు జరిగాయి. సదస్సుల్లో సమర్పించిన పరిశోధన పత్రాలతో 'జానపద గిరిజన విజ్ఞానం- జాతీయ సదస్సుల పత్రాలు' పేరుతో పుస్తకం ప్రచురించారు.


పీఠంలోని గ్రంథాలయం

కళారూపాలపై శోధన

కళాప్రదర్శననే తమ వృత్తిగా స్వీకరించి జీవనం సాగిస్తున్న కళాకారులు వందల సంఖ్యలో ఉన్నారు. వీరిలో చిందు యక్షగానం, డక్కలి, గౌడశెట్టి, ఏనుటి, మందహెచ్చు, కాకిపడిగెల, మాసయ్య, గంజికూటి, కూజరి, డోలి, పట్టెడ, బాట్స్, దాడి, బైండ్ల, దూబ్బుల, బుడబుక్కల, ఒగ్గు, పంబాల, మొండి, గంగిరెద్దు, బాలసంతు, జంగాలు, శారద, డప్పు, పాములాట, చెక్కబొమ్మలాట, తోలుబొమ్మలాట, ఎరుక సోదే, పిట్టలదొర, లంబాడ నృత్యం, కోయనృత్యం, కొర్రాజులు, కూనపులి, ఆద్దెపుసింగు, కాటిపాపల, హరిదాసులు, కడ్డీతంత్రి, కోలాటం, చెక్కభజన, మాలభోగం, కిన్నెర, చిలుకపంచాంగం వంటి ఎందరో కళాకారులు కళనే వృత్తిగా చేసుకుని జీవిస్తున్నారు. వీటిలో ఎన్నో కళారూపాలు అంతరించిపోయే స్థాయిలో ఉన్నాయి. వీటిలో కొన్ని పరిశోధనలు చేసి ఉన్నాయి. వారిజీవన విధానాన్ని పొందుపర్చి పుస్తకాల రూపంలో వెలువరించాల్సిన అవసరం ఉంది.

భవిష్యత్ తరాలకు వారధి



సమాజంలో ఒక్కో కులానికి ఒక్కో కళారూపం ఉండటం విశేషం. ఈ కళారూపాలు అంతరించిపోయే స్థితిలో ఉన్నాయి. ఆ కళారూపాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడమే విజ్ఞాన పీఠం చేసే మహత్కార్యం. భవిష్యత్ తరాలకు వారధిగా ఈ పీఠం పనిచేస్తుంది. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తే మరిన్ని పరిశోధనలతోపాటు విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించొచ్చు. ఈ విద్యాసంవత్సరం ఎం.ఏ హిస్టరీ అండ్ టూరిజం కల్చర్ కోర్సును ప్రవేశపెడుతున్నాం.

– ప్రొఫెసర్ భూక్య బాబురావు, పీఠాధిపతి

జానపద వస్తువులతో మ్యూజియం

భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో సేకరించిన సమాచారాన్ని పీఠంలో ఏర్పాటు చేసిన అభిలేఖన భాండాగారంలో నిక్షిప్తం చేశారు. సుమారు 10వేల ఛాయచిత్రాలు, 9వేల పేజీల శుద్ధ రాత ప్రతులు నిక్షిప్తం చేశారు. అరుదైన జానపద వస్తువులతో మ్యూజియం ఏర్పాటు చేశారు. పీఠంలో పరిశోధకులకు అవసరమైన అనేక గ్రంథాలు, అరుదైన సంపుటాలు ఉన్నాయి. గిరిజన తెగలపై పరిశోధిస్తున్న ఎందరో ఈ గ్రంథాలయాన్ని సందర్శిస్తుంటారు. జానపద గిరిజన విజ్ఞాన పీఠం స్ఫూర్తితోనే పలువిశ్వవిద్యాలయాల్లో కళారూపాలు, గిరిజన సంస్కృతులపై పరిశోధనలు జరుగుతుండటం విశేషం. అయితే.. 2023లో కురిసిన అధిక వర్షాలు, వరదల కారణంగా పీఠం గ్రౌండ్ ఫ్లోర్‌లోని మ్యూజియంలోని సగంపైగా వస్తువులు, గ్రంథాలయంలోని వేలాది పుస్తకాలు నీటిలో మునిగిపోవడంతో పాడైపోవడం బాధాకరం.

జూ పార్క్‌లో పులుల గర్జన

- నేడు ఎన్‌క్లోజర్స్ ప్రారంభించనున్న మంత్రి సురేఖ

సాక్షి ఎఫెక్ట్..

న్యూశాయంపేట: నెల రోజులుగా పర్యాటకులు ఎదురుచూస్తున్న అడవి జంతువుల (పులులు, జింకలు, అడవి దున్నలు) గర్జన శనివారం నుంచి సందర్శకులకు వినిపించనుంది. ఎంటర్ ది ఎన్‌క్లోజర్స్ ఎప్పుడో ..? అనే శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు ఎన్‌క్లోజర్స్ ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నేడు(శనివారం) ఎన్‌క్లోజర్స్ ప్రారంభించనున్నారు. వరంగల్ జూ పార్క్‌కు కొత్త కళ తీసుకురావడానికి అడవి జంతువుల సంఖ్య పెంచాలనే మంత్రి ఆదేశాలతో హైదరాబాద్ నెహ్రూ జువాలజికల్ పార్క్ నుంచి బెంగాల్ టైగర్స్ (శంకర్, కరీనా), బైసన్స్ (అడవి దున్నలు), విశాఖపట్నం నుంచి బార్కిన్‌సన్ డీర్స్(జింకలు) తీసుకొచ్చారు. నెల రోజులుగా బోన్లలో బందీలుగా ఉన్న ఈ జంతువులు 'సాక్షి' కథనంతో పర్యాటకులను సందడి చేయడానికి రానున్నాయి.

అలజడి చేయనున్న అడవి జంతువులు

కొన్నేళ్లుగా చెప్పుకోదగ్గ వన్యప్రాణులు లేక వెలవెలబోయిన ఓరుగల్లు జూ పార్క్‌కు ప్రస్తుతం కొత్తగా వచ్చిన బెంగాల్ టైగర్స్, బైసన్(అడవి దున్నలు), హగ్‌డీర్, బార్కిన్‌సన్ డీర్స్(జింకలు) సందడి చేయనున్నాయి. హైదరాబాద్ జూపార్క్ తర్వాత రాష్ట్రంలోనే రెండోదైన వరంగల్ కాకతీయ జూపార్క్ అభివృద్ధికి జిల్లా మంత్రి సురేఖ ప్రత్యేక చొరవ చూపడంతో మరిన్ని జంతువులు ఇక్కడకు వస్తున్నాయి.

హోరాహోరీగా ఖోఖో పోటీలు

- నేటితో ముగియనున్న టోర్నమెంట్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బాలకిశోర్‌రెడ్డి, తదితరులు

గీసుకొండ : గీసుకొండలో ఖోఖో సీనియర్స్ 57వ అంతర్ జిల్లాల క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ పోటీల్లో పురుషులు, మహిళ, పోలీసు జట్లు ఇలా 21 టీంలు పాల్గొంటున్నాయి. పోటీలు గురువారం ప్రారంభం కాగా శనివారంతో ముగుస్తాయని టోర్నమెంట్ ఆర్గనైజర్ వీరగోని రాజ్‌కుమార్ తెలిపారు. టోర్నమెంట్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు అల్లం బాలకిషోర్‌రెడ్డి శుక్రవారం పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిలో ఉత్తేజం నింపారు. డే అండ్ నైట్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. తహసీల్దార్ రియాజుద్దీన్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కోట రాంబాబు, పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ రడం శ్రీధర్, మాజీ సర్పంచ్ గోనె మల్లారెడ్డి పాల్గొన్నారు.

శుక్రవారం పోటీలు ఇలా..

పురుషుల విభాగంలో..

హైదరాబాద్ జట్టు ఖమ్మం–బీ జట్టును, రంగారెడ్డి జట్టు టీఎస్ పోలీస్–బీ జట్లును, ఆదిలాబాద్ జట్టు కరీంనగర్–ఏ ను, మెదక్ జట్టు నల్గొండ–ఏ ను, హైదరబాద్ జట్టు టీఎస్ పోలీస్–బీ ని, రంగారెడ్డి జట్టు మహబూబ్‌నగర్–బీ ని, ఖమ్మం జట్టు నిజామాబాద్–బి ని, కరీంనగర్ జట్టు మెదక్–ఏ ను, రంగారెడ్డి జట్టు ఖమ్మం–బి ని, వరంగల్ జట్టు ఆదిలాబాద్–ఏ ను, టీఎస్ పోలీస్ జట్టు నిజామాబాద్–బీ ని, హైదరాబాద్ జట్టు మహబూబ్‌నగర్–బి జట్టును ఓడించాయి.

మహిళల జట్లు..

మహబూబ్‌నగర్ జట్టు ఆదిలాబాద్–బి జట్టును, హైదరాబాద్ జట్టు కరీంనగర్–ఏ జట్టును, రంగారెడ్డి జట్టు మెదక్–బీ ని, నల్గొండ జట్టు వరంగల్– ఏ జట్టును, ఆదిలాబాద్ జట్టు నిజామాబాద్–బీ ని, నల్గొండ జట్టు కరీంనగర్–ఏ ను, రంగారెడ్డి జట్టు ఆదిలాబాద్–బీ ని, హైదరాబాద్ జట్టు వరంగల్–ఏ ను, మహబూబ్‌నగర్ జట్టు మెదక్ –బీ ని, ఖమ్మం జట్టు కరీంనగర్–ఏ ను ఓడించాయి.

సరస్వతి పుష్కరాలకు ఏర్పాట్లు

మే 15నుంచి 26 వరకు నిర్వహణ

- రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్
- ఫిబ్రవరి 7 నుంచి 9 వరకు కుంభాభిషేకం
- ఇబ్బందిలేకుండా ఏర్పాట్లు చేయాలి
- గోదావరి వద్ద సరస్వతి మాత విగ్రహం
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి


గోదావరి ప్రధాన ఘాటును పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

కాళేశ్వరం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరిగే సరస్వతీ నది పుష్కరాలను వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తామని దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఈఓ కార్యాలయంలో ఆయన అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. రూ.25కోట్ల నిధులతో చేపట్టిన పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు.

వచ్చే నెల 7వ తేదీ నుంచి కుంభాభిషేకం

ఫిబ్రవరి 7వ తేదీనుంచి 9వ తేదీవరకు మూర్తులతో పాటు రాజగోపురాలు, ప్రధానాలయం, శుభానందాదేవి, సరస్వతి అమ్మవారి ఆలయాల్లో సంప్రోక్షణతో పాటు కుంభాభిషేక పూజలు శృంగేరి పీఠానికి చెందిన వేదపండితులతో నిర్వహించడానికి ముహూర్తం ఖరారు చేసినట్లు కమిషనర్ శ్రీధర్ పేర్కొన్నారు. అధిక సంఖ్యలో వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

మే 15వతేదీ నుంచి పుష్కరాలు..

మే 15వ తేదీనుంచి 26వ తేదీవరకు నిర్వహించే సరస్వతి నది పుష్కరాలకు 19 శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఇతర రాష్ట్రాల నుంచి 12 రోజుల పాటు రోజుకు 50 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

రూ.25కోట్ల నిధులు మంజూరు

సరస్వతి నది పుష్కరాల పనుల కోసం ప్రభుత్వం రూ.25కోట్ల నిధులను మంజూరు చేసినట్లు దేవస్థానం ఈఓ ఏ.మారుతి శుక్రవారం తెలిపారు. రూ.35.43కోట్లకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, రూ.25కోట్లతో చేపట్టు పనులకు ఆర్డర్ వచ్చినట్లు తెలిపారు. రూ.10కోట్లు సింగరేణి సీఎస్ఆర్ నిధుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. త్వరలో మంజూరు కానున్నాయని ఈఓ పేర్కొన్నారు.

సరస్వతీమాత విగ్రహం

గోదావరి పుష్కరాలకు సరస్వతీ మాత విగ్రహాన్ని ప్రధాన ఘాట్ వద్ద నిర్మాణం చేయడానికి స్థలం పరిశీలించారు. అలాగే మే 15న సరస్వతి పుష్కరాల ప్రారంభోత్సవ పూజను ప్రధాన ఘాట్ ప్రాంతం గోదావరిలో చేయనున్నారు.

పుష్కరాలకు విస్తృత ఏర్పాట్లు

పార్కింగ్ సౌకర్యం కల్పించి, వన్ వే రూట్ ఏర్పాటు చేసి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపించాలని తెలిపారు. మెడికల్ క్యాంపులు, అంబులెన్స్‌లు, ప్రధాన వీఐపీ ఘాట్‌ల వద్ద ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. నది పరిసరాలలో మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, చలువ పందిళ్లు వేయాలని ఆయన పేర్కొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి


మాట్లాడుతున్న కమిషనర్ శ్రీధర్

ఏ ఒక్కరిపై భారం పడకుండా అందరూ బాధ్యత తీసుకోవాలని, వలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుని, అన్ని శాఖలు టీమ్ వర్క్ చేయాలని కమిషనర్ సూచించారు. కుంభాభిషేకానికి తాను వచ్చేనాటికి మిగిలిన పనులు పూర్తి కావాలని సంబంధిత శాఖల అధికారులకు తెలిపారు. నేషనల్ హైవేపై కుదురుపల్లి బ్రిడ్జి దగ్గర రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం వీఐపీ, ప్రధాన ఘాటులో అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, దేవాదాయశాఖ ఆర్జేసీ రామకృష్ణ, అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్, ఈఓ మారుతి, ప్రధాన అర్చకుడు కృష్ణమూర్తిశర్మ, ఉపప్రధాన అర్చకుడు ఫణీంద్రశర్మ, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూస్ ఈఈ నిర్మల, ఇరిగేషన్ డీఈఈ సూర్యప్రకాశ్, డీఎల్‌పీఓ వీరభద్రయ్య, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కవిత, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీఐ రామచంద్రరావు, ఎస్సై తమాషారెడ్డి పాల్గొన్నారు.

వరంగల్‌లో స్పోర్ట్స్ విలేజ్

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- జేఎన్ఎస్‌లో 34వ సీనియర్ నేషనల్స్ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్
- 28 రాష్ట్రాలు– 600 మంది క్రీడాకారులు
- ఈ నెల 14 వరకు కొనసాగనున్న పోటీలు


మాట్లాడుతున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ నగరంలో స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటుకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలంతా కలసి స్థల సేకరణకు అన్వేషిస్తున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 34వ సీనియర్ నేషనల్స్ సెపక్‌తక్రా మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ శుక్రవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా అనంతరం బాణసంచా కాల్చి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. వరంగల్ మామునూరు, జక్కలొద్ది ప్రాంతాల్లో 100 ఎకరాల్లో స్పోర్ట్స్ విలేజ్ ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తెలంగాణ సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కానుగంటి శేఖర్ మాట్లాడుతూ.. 28 రాష్ట్రాల నుంచి పురుషుల జట్లు, 22 రాష్ట్రాల మహిళల జట్లు, 30 మంది టెక్నికల్ అఫిషియల్స్ హాజరయ్యారని తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో జపాన్‌లో జరుగనున్న ఏషియన్ గేమ్స్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల బీజేపీ అధ్యక్షులు రావు పద్మ, చందుపట్ల కీర్తిరెడ్డి, డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమేశ్‌రెడ్డి, తెలంగాణ సెపక్‌తక్రా అసోసియేషన్ చైర్మన్ లయన్ హనుమాండ్ల రెడ్డి, ప్రేమ్‌రాజ్, విశేష్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, జగన్నాథస్వామి, శ్రీధర్, సంజీవరెడ్డి, అనిత, శిరీష తదితరులు పాల్గొన్నారు.


పోటీలో తలపడుతున్న తెలంగాణ- మణిపూర్ జట్లు

మొదటి రోజు ఆట..

మొదటి రోజు జరిగిన మ్యాచ్‌ల్లో ఎస్ఎస్‌బీ టీం ఆడిన ప్రతి మ్యాచ్‌లో విజయం సాధించింది. అందుకు భిన్నంగా తెలంగాణ జట్టు ఆడిన ప్రతీ మ్యాచ్‌ను ఓటమి చవిచూసింది. బెస్ట్ ఆఫ్ త్రీ పద్ధతిలో సాగిన మ్యాచ్‌లో ఒక్క మ్యాచ్‌ను కూడా గెలవకపోవడం తెలంగాణ క్రీడాకారులను నిరుత్సాహపరిచింది.